# పొంచి ఉన్న ముంపు ముప్పు



బొమ్మూరు వద్ద కాలువలో పేరుకుపోయిన పూడిక



హుకుంపేట వద్ద తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా ఉన్న కాలువ

- కాలువలో పేరుకుపోయిన పూడిక
- వర్షం కురిస్తే అవస్థలే..
- అన్నదాతల ఆందోళన

**రాజమహేంద్రవరం రూరల్:** హుకుంపేట గ్రామం నుంచి జాతీయ రహదారి కిందగా బొమ్మూరు మీదుగా వెళ్లే కాలువలో పూడిక పెరిగిపోయింది. దీంతో మురుగునీరు వెనక్కుతున్నుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పంటచేలు ముంపు బారిన పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా.. పిడింగొయ్యి, హుకుంపేట పంచాయతీల మీదుగా వచ్చే మురుగునీరు మేకప్పుచెరువు మీదుగా వరలక్ష్మి కాలనీ పక్కనే గల కాలువలో కలుస్తుంది. అక్కడి నుంచి ఆ కాలువ బొమ్మూరు చెరుకూరి గోడౌన్స్ పక్క నుంచి బాలాజీపేట సెంటర్ కాలువలో కలిసి ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్దకు చేరుతుంది. ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు హుకుంపేట, బొమ్మూరు ఆవ కాలువలో పూడికలు తీశారు. కానీ హుకుంపేట బొమ్మూరు కాలువలో పూడికలు తీయకపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. కాలువలో పూడిక తీయకపోవడంతో భారీ వర్షం కురిస్తే హుకుంపేట, బొమ్మూరు గ్రామాల్లోని పంట చేలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. గతంలో గోదావరి పెరిగినప్పుడల్లా పంట పొలాలు మునిగిపోయేవి. గతంలో బొమ్మూరు, హుకుంపేట కాలువల్లో మండల పరిషత్ నిధులు, ఆయా గ్రామపంచాయతీల పరిధిలో పంచాయతీల నిధులతో కాలువలో పూడికలు తీయించారు.

**వంద ఎకరాలకు ముంపు ముప్పు**

హుకుంపేట, బొమ్మూరు గ్రామాల్లోని సుమారు 100 ఎకరాలలో వరిచేలు, గడ్డిమడులు ఉన్నాయి. గోదావరిలో వరద వచ్చిన ప్రతిసారీ ఈ పంట పొలాలు మునగడం, పండిన పంట చేతికి అందకపోవడం జరుగుతూ వస్తుంది. బొమ్మూరు, హుకుంపేట కాలువలో పూడికలు త్వరితగతిన చేపడితే తమకు ఎటువంటి ముంపు సమస్య ఉండదని పలువురు రైతులు చెబుతున్నారు. కాగా.. బొమ్మూరు, హుకుంపేట కాలువలోని పూడికలు త్వరితగతిన తీయిస్తామని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరెడ్డి, జి.వెంకటరావు 'సాక్షి'కి తెలిపారు. ప్రతి ఏటా పంచాయతీ నిధులతో పూడికలు తీయించడం జరుగుతుందన్నారు. ఈసారీ కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## పాఠ్య పుస్తకాలు అందజేయాలని వినతి



డీవీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**కంబాలచెరువు:** ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని ఇంటర్ బోర్డు డీవీఈఓ, ఆర్జేడీలకు వినతిపత్రం అందజేసినట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ అధ్యక్షుడు వై.భాస్కర్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ విద్యాసంస్థలు ఈ నెల ఒకటో తేదీ నుంచి తెరచుకున్నాయని, అయితే విద్యార్థులు చదువుకోవడానికి పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేవన్నారు. 2012 నుంచి ఇప్పటి వరకూ కూడా ఇంటర్మీడియెట్ అధ్యాపక పోస్టులు భర్తీ చేయలేదన్నారు. కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని, వీటిని అరికట్టాలన్నారు. కొన్ని కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో సమయానికి మించి క్లాసులు నిర్వహిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్మకాలు చేస్తున్నారన్నారు.

## క్లుప్తంగా

### బడి ఈడు పిల్లలందరూ చదువుకోవాలి

**కంబాలచెరువు:** బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చదువుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు అమ్మినాయుడు అన్నారు. స్థానిక లాలాచెరువు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నేను బడికి పోతా కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఆవాస ప్రాంతంలో బడిఈడు గల బాలలను గుర్తించి, పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మదింపు చేయాలన్నారు. ఈ సందర్భంగా మధ్యలో బడి మానేసిన మాగాపు ఉమాదేవికి ఆరో తరగతిలో ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఐఈ కోఆర్డినేటర్ కనక బాబు, ప్రత్యామ్నాయ పాఠశాలల డీసీడీవోడీ ఇ.రాణి, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బొజ్జా తారకం సేవలు ఎనలేనివి

**కడియం:** హక్కుల పరిరక్షణకు పాడుపడే వ్యక్తిగా, న్యాయవాదిగా బొజ్జా తారకం అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. పొట్టిలంక అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బొజ్జా తారకం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ నాయకులు నక్కా వెంకట రత్నరాజు, కోణాల లాజర్, నక్కా చంటిబాబు, అంబటి రాజారత్నం పాల్గొన్నారు.

### భవిత కేంద్రం సందర్శన



ధవళేశ్వరంలో భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న అమ్మినాయుడు

**ధవళేశ్వరం:** ప్రత్యేక అవసరాలు గల పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భవిత రాష్ట్ర పరిశీలకులు అమ్మినాయుడు సూచించారు. ధవళేశ్వరంలోని భవిత కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. సర్వేలో గుర్తించిన వారిని పాఠశాలల్లో నమోదు చేయాలన్నారు. వినికిడి లోపం ఉన్న పిల్లలలో సంజ్ఞా భాషను బాగా అభివృద్ధి చేయాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఈ విద్యార్థులకు త్వరగా ప్రబలే అవకాశం ఉన్నందున వారికి గోరువెచ్చని నీరు, మంచి ఆహారాన్ని అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త కనక బాబు, ఐఈఆర్‌పీలు వెంకట లక్ష్మీవిశ్వపతి, ఏఎల్ఎస్‌కో ఆర్డినేటర్ రాణి, ఎంఈఓ -2 చందుకుమార్ పాల్గొన్నారు.

### డీఎస్సీ వయోపరిమితిని పొడిగించాలి

**కంబాలచెరువు:** త్వరలో విడుదలయ్యే డీఎస్సీ నోటిఫికేషన్‌లో అభ్యర్థుల వయోపరిమితి సడలింపును 48 ఏళ్లకు పొడిగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ కుమార్ కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. ఆరేళ్ల నుంచి రాష్ట్రంలో డీఎస్సీ లేనందున, కొందరికి వయోపరిమితి మించిపోయిందన్నారు.

### విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



విద్యార్థి తండ్రికి సాయం అందిస్తున్న సత్యనారాయణమూర్తి

**రాజమహేంద్రవరం సిటీ:** విద్యార్థి చదువు కోసం స్వర్ణాంధ్ర సేవాసంస్థ రూ.పదివేల విరాళం అందించడం అభినందనీయమని మున్సిపల్ పరిపాలన శాఖ పూర్వపు రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక స్వర్ణాంధ్ర సంస్థలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఖాజా నిషార్ అహ్మద్ అనే విద్యార్థి ఫీజు కోసం అతడి తండ్రి హాజీ భాషాకు రూ.పదివేలు అందజేశారు. కార్యక్రమంలో జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరాం, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన

**సీతానగరం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో గురువారం వైద్య సిబ్బందికి సదస్సు నిర్వహించారు. డయేరియాతో పాటు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణా చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా ఆశించే ప్రమాదం ఉందన్నారు. సకాలంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణానికే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. దీని నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏసురాణి, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్ వైజర్ కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 29న మిస్ రాజమహేంద్రవరం ఆడిషన్లు



కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

**రాజమహేంద్రవరం సిటీ:** రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో రోటరీ ఐకాన్స్ మిస్ రాజమహేంద్రవరం కాంటెస్ట్ 2024కు సంబంధించిన ఆడిషన్లు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జేఎన్ రోడ్డులోని డి1 కన్వెన్షన్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు. ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంపై ఇప్పటికే విస్తృతంగా ప్రచారం నిర్వహించామని, సుమారు 300 వరకు ఎంట్రీలు వచ్చాయన్నారు. శనివారం వరకూ అవకాశం ఉన్నందున మరిన్ని పెరిగే అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలవారు 90520 77377 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆనం కళాకేంద్రంలో వచ్చే నెల 20వ తేదీన జరిగే ఫైనల్ జడ్జిమెంట్‌లో విజేతకు క్రౌన్‌తో పాటు బహుమతులను మిస్ ఇండియా వరల్డ్ 2023 నందినీ గుప్తా చేతుల మీదుగా అందజేస్తామన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు పి.రఘునాథరాజు మాట్లాడుతూ యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ కమింగ్ ప్రెసిడెంట్ యిమ్మని వెంకట్, అనుకుమార్, ఎస్‌టీ కుమార్ పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ చైర్మన్ ప్రకాశ్ బాబు

**కంబాలచెరువు:** విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు అన్నారు. స్థానిక 50వ డివిజన్ లాలాచెరువు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాన్ని నిరంతర సాధనతో చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులను, పెద్దలను, చట్టాలను గౌరవించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలిత కుమారి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజకుమార్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, హెచ్ఎం ఏ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హెలెన్ కెల్లర్ మార్గదర్శకురాలు



హెలెన్ కెల్లర్ జయంతిలో పాల్గొన్న పలుకు విద్యార్థులు

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** అంధులు, బధిరులకు విద్యను బోధించడానికి ప్రత్యేక ఉపాధ్యాయుడి ఆవశ్యకతను వెలుగులోకి తీసుకువచ్చిన హెలెన్ కెల్లర్ అందరికీ మార్గదర్శకులని పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాల నిర్వాహకురాలు గంటా కనకదుర్గ కొనియాడారు. స్వరాజ్ నగర్‌లోని సంకల్పమ్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం హెలెన్ కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకురాలు కనకదుర్గ మాట్లాడుతూ హెలెన్ కెల్లర్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు.

# ఉద్యాన పరిశోధనా కేంద్రాలుగా నర్సరీలు

**కడియం:** ఉద్యాన పరిశోధనా కేంద్రాలుగా కడియం ప్రాంత నర్సరీలు పనిచేస్తున్నాయని హైదరాబాద్‌కు చెందిన అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, డాక్టర్ ఆర్‌కే మాథుర్ అన్నారు. కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీని వంద మంది శాస్త్రవేత్తల బృందంతో కలిసి వీరు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, విదేశీ రకాలకు చెందిన ఉద్యాన మొక్కలు ఒకేచోట లభించే ఏకైక ప్రాంతం కడియమన్నారు. కొన్ని వేల రకాల మొక్కలు, శాస్త్రీయ నామాలను గురించి తెలుసుకోవచ్చన్నారు. అందుకే తాము ఏర్పాటు చేసే విజ్ఞాన ప్రదర్శనలలో కడియం ప్రాంతాన్ని ఎంచుకుంటామని వివరించారు. ఉద్యాన శిక్షకులు ప్రమీలా రాణి, కరుణశ్రీ మాట్లాడారు. వివిధ రకాల మొక్కల గురించి పుల్లా చంటియ్య, పెద సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో పుల్లా రామకృష్ణ, పుల్లా వీరబాబు, మెర్ల కృష్ణ పాల్గొన్నారు.

# పేదలకు జీరో బ్యాలెన్స్ ఖాతాలు



విద్యార్థికి బ్యాంకుఖాతా పుస్తకం అందజేస్తున్న కోళ్ల బాబు

**రాజమహేంద్రవరం సిటీ:** నయనాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు జీరో బ్యాలెన్స్ ఖాతాలు ప్రారంభించడం అభినందనీయమని ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (కోళ్ల బాబు ) అన్నారు. నయనాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాంకు ఆఫ్ బరోడా టి.నగర్ శాఖ ద్వారా గురువారం పేదలు, విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నయనాల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోళ్ల బాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా నయనాల కృష్ణారావు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బరోడా బ్యాంకు టి.నగర్ శాఖ మేనేజర్ గురుజోత్ కోహ్లి, స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

# అధికార యంత్రాంగం అప్రమత్తం

- అచ్యుతాపురంలో అదుపులోకి డయేరియా
- ఏర్పాటైన వైద్య శిబిరం



అచ్యుతాపురంలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీఓ నాగలత

**రంగంపేట:** ఈలకొలను సచివాలయం పరిధి అచ్యుతాపురం గ్రామంలో డయేరియా ప్రబలడంతో అప్రమత్తమై, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆ గ్రామంలో ఆరుగురికి వాంతులు, విరేచనాలు కావడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు అందించామన్నారు. ప్రస్తుతం ఆ ఆరుగురూ రికవరీ అయ్యాయన్నారు. గురువారం మరో ఇద్దరికి స్వల్ప లక్షణాలు కనిపించడంతో తగిన వైద్య సేవలు అందించామన్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉందని ఆమె తెలిపారు. కాగా అచ్యుతాపురం గ్రామంలో ఏర్పాటైన శిబిరాన్ని రాజమహేంద్రవరం డీఎంహెచ్ఓ కార్యాలయానికి చెందిన ఎపిడమిక్ సెల్ బృందం, అక్కడి మెడికల్ కళాశాల వైద్యాధికారులు, టెక్నికల్ బృందం వచ్చి గ్రామంలో డయేరియా ప్రబలడానికి గల కారణాలను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగు పరచాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలిచ్చారు. వాటర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్లు, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నీటి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మండల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఈఓపీఆర్డీ వెంకటరత్నం, రాజమహేంద్రవరం డీఎల్‌పీఓ నాగలత, మాజీ ఎంపీపీ నీలపాల త్రిమూర్తులు, సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, పీహెచ్‌సీ డాక్టర్ చిన్నారావు, సీహెచ్ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

### మీ భద్రత మా బాధ్యత

**ప్రకాశం నగర్:** మీ భద్రత మా అందరి బాధ్యత అనే నినాదంతో సుపరిపాలన అందించే దిశలో అడుగులు వేస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆదెమ్మ దిబ్బ వాంబే గృహాల వద్ద గురువారం సాయంత్రం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

### వెదజల్లు సాగును ప్రోత్సహించాలి

**రాజానగరం:** ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నేరుగా విత్తనాలను జల్లే విధానాన్ని ప్రోత్సహించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు బి.ప్రమీలా రాణి, ఉప విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.ముకుందరావు అన్నారు. దీనివల్ల ఎకరాకు రూ.ఆరు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకూ ఖర్చును ఆదా చేయవచ్చన్నారు. దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అక్కడి రికార్డులన్నింటినీ పరిశీలించారు. ఏరువాక కేంద్రం ద్వారా రైతాంగానికి అందిస్తున్న సేవలు, ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో ఏ సమయంలో ఎటువంటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిదో రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయడం వలన మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. మెట్ట ప్రాంతంలో అపరాల సాగును ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ పి. అమ్మాజీ, ఎస్.హైమజ్యోతి పాల్గొన్నారు.

### వైద్య సేవలు వినియోగించుకోండి

**పెదపూడి:** అనపర్తిలోని ప్రాంతీయ ఆసుపత్రి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆ ఆసుపత్రిలో సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందేలా వైద్యులు చూడాలన్నారు. అలాగే 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్‌పై సమీక్షించారు.

### సాయిబాబాకు పూజలు

**రంగంపేట:** పెద రాయవరం గ్రామంలో కొలువైన షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.